సాక్షి శ్రీకాకుళం

గురువారం, 25, ఏప్రిల్, 2024



అభిమాన నేతను చూసిన ఆనందం..



జగనన్నను చూడాలని..



అక్క చెల్లెమ్మల ఆనందం

ఆత్మీయ పరిచయం

శ్రీకాకుళం అర్బన్: వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేయబోయే ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను సభా వేదికపై నుంచి సీఎం వైఎస్ జగన్ పరిచయం చేశారు. పార్టీ నాయకుల్లా కాకుండా తన సొంత కుటుంబ సభ్యులను పరిచయం చేస్తున్నట్లు చెల్లి, అన్న అంటూ సంబోధించడం అభ్యర్థులను ఉద్వేగానికి గురిచేసింది. వేదిక నలువైపులా ఉన్న అభిమానులకు ముచ్చటగొలిపింది.



ఎంపీ అభ్యర్థిగా పేరాడ తిలక్‌ను పరిచయం చేశారు. తిలక్‌కు అవకాశం ఇవ్వాలని, మంచి చేసేలా తనే దగ్గరుండి నడిపిస్తానని అన్నారు.



టెక్కలి ఎమ్మెల్యే అభ్యర్థిగా దువ్వాడ శ్రీనివాస్‌ను పరిచయం చేస్తూ.. పేదల కోసం శ్రీను ఏ స్థాయికి వెళ్లయినా పోరాడగలరని అన్నారు. టెక్కలిలో అధికార మార్పు జరగాలని, శ్రీనుతో తాను మంచి చేయిస్తానని చెప్పారు.



ఆమదాలవలస ఎమ్మెల్యే అభ్యర్థిగా తమ్మినేని సీతారాంను పరిచయం చేస్తూ.. తనకు తండ్రిలాంటి వారని సంబోధించారు. ఆయన ప్రజలకు మంచి చేస్తారని, ఆశీర్వదించాలని కోరారు.



పలాస నుంచి అప్పలరాజును పోటీలో పెడుతున్నామని, డాక్టర్ ఉత్సాహవంతుడని అన్నారు. మంత్రిగా కూడా అందరికీ పరిచయం ఉందని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.



పాతపట్నం నుంచి తన చెల్లెమ్మ నిలబడుతోందని రెడ్డి శాంతిని చూపిస్తూ అన్నారు. అందరి ఆశీస్సులు తన చెల్లిపై ఉంచాలని కోరారు.



ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా పిరియా విజయను పరిచయం చేశారు. ఆమెను తన మరో చెల్లిగా సంబోధిస్తూ.. తన సోదరిని గెలిపించాలని కోరారు.



నరసన్నపేట నుంచి కృష్ణదాస్ అన్న నిలబడుతున్నాడని, నాన్న గారు చనిపోయాక, తాను కష్టాల్లో ఉన్నప్పుడు మొట్టమొదటగా నేనున్నానని అండగా నిలిచి చేయందించిన మంచి మనిషి ధర్మాన కృష్ణదాసన్న అని, కృష్ణదాస్ మంచి చేస్తాడని విశ్వాసం తనకు ఉందని, ఆశీర్వదించాలని విన్నవించారు.



శ్రీకాకుళం నుంచి ధర్మాన ప్రసాదరావు అందరికీ తెలిసిన వ్యక్తేనని, తనకు తండ్రిలాంటి వారని అన్నారు. మీ అందరికీ తన వల్ల ఇంకా మంచి జరగాల్సి ఉందని, దీవించాలని కోరారు.



అక్కవరం బహిరంగ సభకు హాజరైన అశేష జన సందోహం, అభివాదం చేస్తున్న సీఎం జగన్

అక్కవరం జనసాగరం

సిక్కోలు వరపుత్రుడిని చూసి జనప్రవంతే కాదు.. ప్రకృతి కూడా పులకించింది. అంతవరకూ మంటలు పుట్టించిన సూరీడు సల్లబడితే.. ఆకాశం నిండా కమ్ముకున్న మేఘాలు తండోప తండాలుగా తరలివచ్చిన జనాన్ని చల్లబరిచాయి. నింగి నుంచి వాన జల్లులు కురిపించి వరుణుడు ఆశీర్వదించాడు. వాతావరణం అనుకూలించడంతో జనం ఉత్సాహంతో ఉరకలెత్తారు. వెరసి జననేత జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర ముగింపు సభ జరిగిన టెక్కలి మండలం అక్కవరం ప్రాంతం జన సముద్రాన్ని తలపించింది. అంతకుముందు రాత్రి బస చేసిన అక్కివలస శిబిరం నుంచి బుధవారం ఉదయం బస్సు యాత్ర కొనసాగించిన వైఎస్ జగన్ వెంట జనం ప్రవాహంలా అనుసరించారు. దారి పొడవునా రోడ్లకు ఇరువైపులా నిలబడి జననేత రాక కోసం మండుటెండను సైతం లెక్క చేయకుండా ఎదురు చూశారు. అభిమాన నాయకుడిని చూసి ఆనందంతో కేరింతలు కొట్టారు. జేజేలు పలుకుతూ నీరాజనం పట్టారు. పలుచోట్ల మహిళలు మంగళహారతులు పట్టారు. అలా కొన్ని గంటలపాటు ఏకబిగిన సాగిన బస్సు యాత్ర సాయంత్రం అక్కవరం సభాస్థలికి చేరుకునే సరికి అక్కడ పెద్ద జనసముద్రమే స్వాగతం పలికింది. జిల్లా నలుమూలల నుంచి చేరుకున్న ప్రజలు జగన్ మోహన్ రెడ్డికి బ్రహ్మరథం పట్టారు. ఆయన ప్రసంగానికి ఆద్యంతం హర్షామోదాలు తెలుపుతూ జయజయ ధ్వానాలు చేశారు.

- మేమంతా సిద్ధం ముగింపు సభకు పోటెత్తిన జనం
- అక్కవరం చుట్టు పక్కల ప్రాంతమంతా జనసంద్రం
- బస్సు యాత్రకు అడుగడుగునా జననీరాజనం
- ముగింపు సభను ఆశీర్వదించిన ప్రకృతి
- మేఘావృతమై చల్లబడిన వాతావరణం
- చిరు జల్లుల మధ్య చల్లని వాతావరణంలో జరిగిన సభ



ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ చేత అభివాదం చేయిస్తున్న సీఎం వైఎస్ జగన్



సీఎంను చూసేందుకు బస్సెక్కిన అభిమానులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

జననేత రాకతో టెక్కలిలో ప్రకృతి పులకించింది. సెగలు పుట్టించిన మండుటెండ చిన్నబోయింది. ఆకాశం నుంచి వరుణుడి జల్లులు అక్షింతలుగా ఆశీర్వదించాయి. చల్లని వాతావరణంలో మేమంతా సిద్ధం ముగింపు బహిరంగ సభ జరిగింది. జననేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అశేష జనవాహిని బ్రహ్మరథం పట్టింది. అభిమానుల రాకతో అక్కవరం జనసముద్రమైంది. జాతీయ రహదారి తిరునాళ్లను తలపించింది.

అక్కివలస రాత్రి బస నుంచి టెక్కలి మండలం అక్కవరం వరకు జనం నీరాజనం పలకగా, బహిరంగ సభతో జనసంద్రంగా మారింది. బుధవారం ఉదయం 8 గంటల నుంచే ఎచ్చెర్ల నియోజకవర్గం అక్కివలసకు వేలాదిగా అభిమానులు తరలివచ్చారు. యాత్ర ప్రారంభమైన 10.40 గంటల వరకు రోడ్ల వెంబడి వేచి ఉన్నారు. శిబిరం నుంచి బయటకు వచ్చిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని చూసి పులకించిపోయారు. అక్కడి నుంచి దారి పొడవునా బారులు తీరిన జనం ఘనస్వాగతం పలికారు. చిలకపాలెం వచ్చేసరికి జన ప్రభంజనంలా సాగింది. ఎచ్చెర్లకు చేరుకునే సరికి జనాభిమానం పోటెత్తింది. శ్రీకాకుళం కొత్త రోడ్డులో జనకెరటం ఎగిసింది. అభిమానం ముందు మండుటెండ చిన్నబోయింది.

విజయ హారతులు పట్టి..

జాతీయ రహదారిపై జననేత రాక కోసం ప్రతి చోటా జనం బారులు తీరారు. మహిళలు మంగళహారతులు పట్టారు. నృత్యాలు చేస్తూ, కేరింతలు కొట్టారు. బస్సు యాత్ర చేరుకోగానే మడపాం టోల్‌గేట్ ప్రాంతమంతా జనంతో నిండిపోయింది. అక్కడ తనను కలిసేందుకు వచ్చిన పేద సామాన్య ప్రజలతో సీఎం కాసేపు మాట్లాడారు. వివిధ ఆరోగ్య అవసరాల కోసం వచ్చిన వారి కష్టాలు తెలుసుకుని తగు సాయం, న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం నిమ్మాడ కూడలి చిన్న బమ్మిడి జంక్షన్ వద్ద రెండేళ్ల బాలిక లిఖితను ముద్దాడారు. అక్కడే వృద్ధులతో మాట్లాడారు. అక్కడి నుంచి లంచ్ పాయింట్ పరశురాంపురం జంక్షన్ వరకు దారి పొడవునా ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. జై జగన్ నినాదాలతో హోరెత్తించారు. రోడ్ షో మొత్తం జనప్రభంజనంలా సాగింది. సీఎం వైఎస్ జగన్ బస్సు నుంచి దారి పొడవునా ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. తన రాక కోసం వేచి ఉన్న ప్రజలను ఆప్యాయంగా పలకరించారు.

మధ్యాహ్నం భోజనం విరామం అనంతరం బహిరంగ సభ జరిగిన అక్కవరం వరకు భారీ జనసందోహం మధ్య రోడ్ షో సాగింది. అప్పటికే బహిరంగ సభ జరిగిన ప్రాంతంతో పాటు టెక్కలి మొత్తం జనంతో నిండిపోయింది. అప్పటివరకు సెగలు కక్కిన వాతావరణం వైఎస్ జగన్ రాకతో చల్లబడింది. ఆకాశం మేఘావృతమై...చల్లని గాలులతో అప్పటి వరకు వేడిగా ఉన్న ప్రాంతమంతా ఆహ్లాదకరంగా మారింది. మేమంతా సిద్ధం యాత్ర ముగింపు కార్యక్రమానికి విజయ సూచికగా చిన్నపాటి జల్లులు కురిశాయి. ఎక్కడా ఇబ్బంది పెట్టకుండా ఆద్యంతం ప్రకృతి సహకరించింది. తరలివచ్చిన అశేష జనంతో మేమంతా సిద్ధం ముగింపు సభ జనకడలిని తలపించింది. ఎన్నికలకు మేమంతా సిద్ధమంటూ విజయ గర్జన చేసింది.

సీఎం వైఎస్ జగన్ ప్రసంగానికి ముందు ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ మాట్లాడుతూ.. గడిచిన 40 ఏళ్ల టీడీపీ పాలనలో అభివృద్ధికి నోచుకోని టెక్కలి నియోజకవర్గంలో అభివృద్ధి ప్రదాత సీఎం వైఎస్ జగన్ అంటూ ముఖ్యమంత్రికి ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు, స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్సీలు నర్తు రామారావు, పి.విక్రాంత్, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి, విశ్వాసరాయి కళావతి, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, టెక్కలి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ, టెక్కలి నియోజకవర్గ పరిశీలకుడు కాయల వెంకటరెడ్డి, ఇచ్ఛాపురం పరిశీలకుడు చింతాడ రవి, పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు చింతాడ మంజు, కాపు కార్పొరేషన్ చైర్మన్ ఎం.శ్రీకాంత్, టెక్కలి, సంతబొమ్మాళి, నందిగాం, కోటబొమ్మాళి జెడ్పీటీసీలు దువ్వాడ వాణి, పాల వసంత్‌రెడ్డి, పేరాడ భార్గవి, డి. వెంకట్రావు, ఎంపీపీలు ఎ.సరోజనమ్మ,ఎన్.శ్రీరామ్మూర్తి, మేరుగు రాజేశ్వరి, పార్టీ మండల అధ్యక్షులు కె.అజయ్, కె.సతీష్, టి.పాల్గుణరావు, ఎన్.సత్యరాజ్, పీఏసీఎస్ చైర్‌పర్సన్‌లు ఎస్.సత్యం, కె.జగన్నాయకులు, బి.మధు, బి.మురళి, జేసీఎస్ ఇన్‌చార్జిలు ఎస్.మోహన్, జె.జయరాం, జి.నాగు, ఎం.భాస్కర్‌రెడ్డి నాయకులు తమ్మినేని వాణి, చిరంజీవి నాగ్, చింతాడ గణపతి, ఎస్.హేమసుందర్‌రాజు, టి.కిరణ్, బి.పద్మావతి, పద్మజ, బి.హేమమాలిని, ఆర్.శంకర్రావు, కె.రాజేశ్వర్రావు పాటు నాయకులు పాల్గొన్నారు.



ఆడపడుచుతో సెల్ఫీ..



ఓ అభిమాని సందేశం

నిస్సహాయులకు భరోసా

కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ చేయిస్తామన్నారు..



మాది జలుమూరు మండలం, ఉరకలపేట. పుట్టుక నుంచి చెవిటి, మూగ అయిన మా మేనకోడలు చెట్టు మైథిలికి కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీని గతంలో హైదరాబాద్‌లో చేయించాం. అయితే వాళ్లు ఇచ్చిన మిషన్ ఇప్పుడు ఫెయిల్ అయ్యింది. పనిచెయ్యడం లేదు. మళ్లీ సర్జరీ చేయించి మిషన్ వాడేందుకు ఆస్పత్రికి వెళితే రూ.6 లక్షల వరకు ఖర్చవుతుందని ఎస్టిమేషన్ ఇచ్చారు. మాకు అంత స్థోమత లేదు. అందుకే సీఎం జగనన్నను కలిశాం. ఆయన స్పందించి సాయం చేస్తానని హామీ ఇచ్చారు. సర్జరీకి చర్యలు చేపట్టేలా డాక్టర్ హరికృష్ణకు తెలియజేశారు. గత ఐదేళ్లుగా జగనన్న పాలన చూస్తున్నాం కదా మాలాంటి అనారోగ్య బాధితులు లక్షలాది మందిని ఆయన ఆదుకున్నారు. మైథిలిని దగ్గరకు తీసుకుని జగనన్న మాటిచ్చారు. నిజంగా ఆనందాన్ని ఆపుకోలేకపోతున్నాం.

–ఉంగటి రాజేష్ (చెట్టు మైథిలి మామయ్య)

ఆదుకోండి జగనన్న



కోటబొమ్మాళి మండలం కొత్తపేట హైవేపై టెక్కలి మండలం సాకిపల్లి గ్రామానికి చెందిన జలుమూరు మహేష్ అనే పన్నెండేళ్ల దివ్యాంగ బాలుడు తండ్రి అప్పన్నతో కలసి మండుటెండలో రోడ్డు పక్కన వేచి ఉండటాన్ని చూసిన సీఎం జగన్ బస్సును ఆపి ఆప్యాయంగా పలకరించారు. వినికిడి లోపంతో బాధపడుతున్న తన కుమారుడికి వైకల్యం తక్కువగా వుందని డాక్టర్లు నిర్ధారించటంతో పింఛన్ రావటం లేదని చెప్పారు. మీరే ఆదుకోవాలని జగనన్నా అంటూ విజ్ఞప్తి చేశారు. వారికి ముఖ్యమంత్రి 'నేనున్నానన్నా.. మహేష్‌ను చక్కగా చదివించు, ధైర్యంగా ఉండు' అంటూ భరోసా ఇచ్చారు.

క్లుప్తంగా

బుధవారం నామినేషన్లు 52

శ్రీకాకుళం పాతబస్టాండ్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి బుధవారం 52 నామినేషన్లు దాఖలయ్యాయి. శ్రీకాకుళం ఎంపీ స్థానానికి సంబంధించి కింజరాపు రామ్మోహన్‌నాయుడు(టీడీపీ-2 సెట్లు), బోరుభద్ర చంద్రకళ(భారత చైతన్య యువజన పార్టీ), పేరాడ తిలక్(వైఎస్సార్‌సీపీ), కింజరాపు విజయకుమారి(టీడీపీ-2సెట్లు), బొమ్మాళి తిరుపతిరావు(పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), వాబ యోగేశ్వరరావు(ఇండిపెండెంట్-2 సెట్లు) నామినేషన్లు దాఖలు చేశారు.

అసెంబ్లీ స్థానాలకు సంబంధించి ఇచ్ఛాపురంలో మాసుపత్రి చక్రవర్తి రెడ్డి(కాంగ్రెస్), బెందాళం అశోక్(టీడీపీ-2 సెట్లు), బెందాళం నీలోత్పల(టీడీపీ), పిరియా విజయ(వైఎస్సార్‌సీపీ), పిరియా సాయిరాజ్(వైఎస్సార్ సీపీ), బడ్డి ముఖలింగం(భారత చైతన్య యువజన పార్టీ), పలాసలో దత్తి వీరాస్వామి(ఇండిపెండెంట్), కర్ని వెంకటరమణమూర్తి(ఇండిపెండెంట్), గెడ్డం అనిల్‌కుమార్‌రాజు(జైభారత్ నేషనల్ పార్టీ), టెక్కలిలో బైపల్లి పరమేశ్వరరావు(జైభారత్ నేషనల్ పార్టీ), కిల్లి విక్రాంత్(కాంగ్రెస్), దువ్వాడ శ్రీనివాస్(వైఎస్సార్ సీపీ), పాతపట్నంలో బొడ్డేపల్లి కృష్ణారావు(బీఎస్పీ-2 సెట్లు), అసపాన శంకరరావు(ఇండిపెండెంట్), మామిడి గోవిందరావు(టీడీపీ), శ్రీకాకుళంలో అంబటి కృష్ణారావు(కాంగ్రెస్-2 సెట్లు), ధర్మాన ప్రసాదరావు(వైఎస్సార్ సీపీ-2 సెట్లు), ధర్మాన ప్రసాదరావు(ఇండిపెండెంట్), గుజ్జల సూర్యనారాయణ(బీఎస్పీ), పానిల సంతోషమ్మ(ఇండిపెండెంట్), ఆమదాలవలసలో సువ్వారి గాంధీ(ఇండిపెండెంట్-3 సెట్లు), గురుగు రేవతి(జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ), సువ్వారి సత్యనారాయణ(ఇండిపెండెంట్), సువ్వారి దివ్య(ఇండిపెండెంట్), ఎచ్చెర్లలో కొత్తకోట్ల సింహాద్రినాయుడు(కాంగ్రెస్), గొర్లె కిరణ్‌కుమార్(వైఎస్సార్ సీపీ), గొర్లె పరిమళ(వైఎస్సార్ సీపీ), గంట్లాన రామారావు(బీఎస్పీ), నడుకుదిటి ఈశ్వరరావు(బీజేపీ-2 సెట్లు), నడుకుదిటి రజని(బీజేపీ-2 సెట్లు), నరసన్నపేటలో చీపురు రవి(జైభారత్ నేషనల్ పార్టీ), ధర్మాన కృష్ణదాస్(వైఎస్సార్‌సీపీ), ధర్మాన కృష్ణచైతన్య(వైఎస్సార్ సీపీ), బగ్గు రమణమూర్తి(టీడీపీ-2 సెట్లు) నామినేషన్లు దాఖలు చేశారు.

నామినేషన్ల పరిశీలన రేపు

శ్రీకాకుళం పాతబస్టాండ్: నామినేషన్ల పరిశీలన ఈ నెల 26న ఉంటుందని, 29వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను ఉప సంహరించుకునేందుకు వీలుంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఆయన ఆర్వోలు, నోడల్ అధికారులతో సమావేశంలో మాట్లాడారు. నామినేషన్ల ఉప సంహరణ అనంతరం సింబల్ అలాట్‌మెంట్ జరుగుతుందని వివరించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఉండేందుకు ఆర్వోలకు శిక్షణ ఇచ్చామని, ఆ రోజు ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకుల సమక్షంలో నామినేషన్ల పరిశీలన ఉంటుందని తెలిపారు. మే 7 నుంచి 9 వరకు హోమ్ ఓటింగ్‌కు చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఒక్కరోజులోనే పూర్తి చేసేలా టీమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు.

వడదెబ్బకు గుర్తు తెలియని మహిళ మృతి


మహిళ మృతదేహం

జి.సిగడాం: మండలంలోని మెట్టవలస బస్టాప్ వద్ద వడదెబ్బకు గురై గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. మెట్టవలస ప్రాంతంలోని శుభకార్యాలకు వచ్చిన ఈమె బుధవారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో వడదెబ్బకు గురై కుప్పకూలిపోయింది. వెంటనే స్థానికులు 108 అంబులెన్సులో రాజాం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం 5.30 గంటలకు మృతి చెందింది. మృతురాలు ఆకు పచ్చ జాకెట్, గులాబీ రంగు చీర కట్టుకుని, సుమారు 55 ఏళ్ల వయసుంటుందని, మృతదేహాన్ని రాజాం ప్రభుత్వం ఆసుపత్రిలో ఉంచామని, వివరాలు తెలిసిన వారు 6309990877 నంబర్‌ను సంప్రదించాలని ఎస్‌ఐ తెలిపారు.

పుస్తెల తాడు చోరీ

బూర్జ: మండలంలోని కాలపర్తి పంచాయతీ చలికాంలో బుధవారం మూడు తులాల పుస్తెల తాడు చోరీకి గురైంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పశువుల శాలలో ఆవులకు మేత పెట్టేందుకు పొంద్రంకి రమణమ్మ వెళ్లింది. అదే సమయంలో గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు మోటారు బైక్‌పై ఆమె వద్దకు వెళ్లి పక్క గ్రామమైన చింతలపేటకు తోవ చెప్పమని అడిగారు. ఆమె తోవ చూపించి వెనుదిరిగి వస్తుండగా మెడలో ఉన్న పుస్తెల తాడు తెంచుకొని వెళ్లిపోయారు. ఆమె అక్కడే స్పృహతప్పి పడిపోయింది. బాధిత మహిళ లబోదిబోమంటుంది. గ్రామ పెద్దల సహకారంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధిత మహిళ కుమారుడు వెంకటరావు ఫిర్యాదు చేశారు.

నేడు 13 మండలాల్లో తీవ్ర వడగాలులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికల ప్రకారం గురువారం జిల్లాలోని 13 మండలాల్లో తీవ్ర వడగాలులు, 15 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సమూన్ తెలిపారు. బుధవారం బూర్జ మండలంలో 42.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు పేర్కొన్నారు.

అభిమాన జనసంద్రం..


ధర్మాన నామినేషన్‌కు తరలివచ్చిన అభిమానులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు

శ్రీకాకుళం పాతబస్టాండ్, శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం అసెంబ్లీ స్థానానికి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ధర్మాన ప్రసాదరావు బుధవారం నామినేషన్ వేశారు. ఆయన తన నామినేషను పత్రాలను శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి సీహెచ్ రంగయ్యకు అందజేశారు. ఆయనతో పాటుగా శిమ్మ రాజశేఖర్, ఎంపీ పద్మావతిలు ఉన్నారు. అంతకుముందు నగరంలోని 80 అడుగుల రోడ్డులో పార్టీ కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు.


నామినేషన్ దాఖలు చేస్తున్న ధర్మాన ప్రసాదరావు

అట్టహాసంగా..


అభిమానుల కోలాహలం మధ్య ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

రణస్థలం/జి. సిగడాం: ఎచ్చెర్ల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా గొర్లె కిరణ్‌కుమార్ బుధవారం అట్టహాసంగా నామినేషన్ వేశారు. ఎచ్చెర్ల మండలంలోని అరిణాం అక్కివలస గ్రామ సమీపంలోని సీఎం మేమంతా సిద్ధం సభా ప్రాంగణం నుంచి రణస్థలం తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ చేశారు. అనంతరం నామినేషన్ పత్రాలపై సంతకాలు చేసి రణస్థలం ఆర్‌ఓ కార్యాలయంలో దాఖలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పిన్నింటి సాయికుమార్, టొంపల సీతారాం, రొక్కం బాలకృష్ణ, బల్లాడ జనార్దన రెడ్డి, హేమామాలినీ రెడ్డి, జరుగుళ్ల శంకరరావు తదితరులు ఉన్నారు.


నామినేషన్ దాఖలు చేస్తున్న గొర్లె కిరణ్ కుమార్

కంట్రోల్ రూమ్ పరిశీలన

శ్రీకాకుళం పాతబస్టాండ్: సాధారణ ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, కంట్రోల్ రూమ్ (ఎన్నికల నియంత్రణ కేంద్రం)లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ బుధవారం పరిశీలించారు.

అన్ని విభాగాలను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు. మద్యం నిల్వల కేంద్రాన్ని, వాటి సరఫరా జరుగుతున్న తీరును, అక్కడే ఉన్న సెబ్ అధికారులతో కలిసి సీసీ కెమెరాల ద్వారా పరిశీలించారు. కాల్ సెంటర్, సీ-విజిల్‌కు వస్తున్న ఫిర్యాదులు, తీసుకున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. సీపీఓ ప్రసన్నలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, హౌసింగ్ పీడీ గణపతిరావు, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవరావు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్న కేశవరావు, డీపీఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సమక్షంలో చేరికలు


పార్టీలో చేరుతున్న టీడీపీ రణస్థలం మాజీ ఎంపీపీ గొర్లె విజయ్‌కుమార్


పార్టీలో చేరుతున్న టీడీపీ రణస్థలం మండల ఉపాధ్యక్షుడు డి.రామారావు

ఎచ్చెర్ల క్యాంపస్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం యాత్రలో భాగంగా ఎచ్చెర్ల మండలం అరిణాంఅక్కివలసలో మంగళవారం రాత్రి బస చేశారు. ఈ శిబిరం వద్ద బుధవారం పలువురు సీఎంను కలిసి వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరినీ సీఎం వైఎస్ జగన్ ఆత్మీయంగా పార్టీలోకి ఆహ్వానించారు.

- రణస్థలం ఎంపీటీసీ సభ్యురాలు మజ్జి గౌరి, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు మజ్జి రమేష్, మాజీ ఎంపీపీ గొర్లె విజయ్‌కుమార్, టీడీపీ సీనియర్ నాయకులు రామారావు వైఎస్సార్ సీపీలో చేరారు. కార్యక్రమంలో విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, మాజీ డిప్యూటీ సీఎం, జిల్లా పార్టీ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, డిప్యూటీ రీజనల్ మేనేజర్ మజ్జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.
- హిరమండలం మాజీ జెడ్పీటీసీ సభ్యులు లోలుగు లక్ష్మణరావు వైఎస్సార్ సీపీ పార్టీలో చేరారు. కార్యక్రమంలో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, డిప్యూటీ రిజనల్ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


పార్టీలో చేరుతున్న హిరమండలం మాజీ జెడ్పీటీసీ సభ్యులు లోలుగు లక్ష్మణరావు


రణస్థలం ఎంపీటీసీ సభ్యురాలు మజ్జి గౌరి, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు మజ్జి రమేష్‌లను వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న సీఎం జగన్

ధర్మాన ర్యాలీ.. చంద్రబాబు సభ ఖాళీ

శ్రీకాకుళం: శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు నామినేషన్ వేసేందుకు బుధవారం అశేష జనవాహినితో కలిసి ర్యాలీగా వెళ్లటం చూసి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఖంగుతిన్నారు. మంగళవారం జిల్లాకు వచ్చిన చంద్రబాబు 80 అడుగుల రోడ్డులో టీడీపీ జిల్లా కార్యాలయం ఆవరణలో రాత్రి బస చేశారు. బుధవారం ఉదయం పదిన్నర గంటలకు చంద్రబాబు ఏడు రోడ్ల కూడలికి బయలుదేరాల్సి ఉండగా అదే సమయంలో ధర్మాన నామినేషన్ దాఖలు చేసేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళుతున్నారు. సమాచారం తెలుసుకుని కార్యాలయం ఆవరణలో చంద్రబాబు ఉండిపోయారు. అశేష జనవాహిని ధర్మాన వెంట నడిచి వెళ్లటం చూసి లోలోనే ఆందోళనకు గురయ్యారు. ఈ ర్యాలీ వెళ్లిన అరగంట తరువాత చంద్రబాబు ఏడు రోడ్ల కూడలిలోని ఎన్టీఆర్ మైదానంలో ప్రజాగళం పేరిట నిర్వహించిన మహిళలతో మాటామంతీ కార్యక్రమానికి వెళ్లారు. ఐదు వేల మంది హాజరవుతారని టీడీపీ వర్గాలు అంచనా వేయగా అందులో సగం కూడా రాకపోవడంతో ఎక్కువ సేపు ప్రసంగించకుండా ముగించేశారు. ఇదే సభలో కూన రవికుమార్ మాట్లాడుతూ నాలుగున్నరేళ్లగా తాను నిర్వహిస్తున్న అధ్యక్ష పదవిని స్వచ్ఛందగా వదులుకుంటున్నారని, ఆ పదవిని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణకు ఇవ్వాలని సూచించగా చంద్రబాబు సమ్మతించారు.

నమ్మిన క్యాడర్‌ను అమ్మేసిన కలమట!

ఎల్.ఎన్.పేట: పాతపట్నం నియోజకవర్గంలో టీడీపీ రాజకీయాలు రోజుకో మలుపు తిరుగుతున్నాయి. 'పాతపట్నం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా 420కి టికెట్ కేటాయించారు. కూన రవికుమార్ టికెట్ అమ్ముకున్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలో ప్రచారం చేసి కూనను ఓడించి తీరుతాను. అచ్చెన్నాయుడు కుట్ర రాజకీయాలకు పాల్పడ్డారు. కాపు సామాజికవర్గం ఎక్కువగా ఉన్న పాతపట్నం, వెలమ సామాజిక వర్గం ఎక్కువగా ఉన్న శ్రీకాకుళం నియోజకవర్గాల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థుల ఎంపికలో కుట్ర జరిగింది..' ఇవీ కొన్ని రోజుల ముందు పాతపట్నం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ చేసిన విమర్శలివి. అయితే మంగళవారం రాత్రి చంద్రబాబు కలమటతో మాట్లాడి శ్రీకాకుళం పార్లమెంటు స్థాయి టీడీపీ అధ్యక్ష స్థానంతో పాటు అధికారంలోకి వస్తే సముచిత స్థానం కల్పిస్తామని మాట ఇవ్వటంతో 'కలమట 420' అని ప్రచారం చేసే మామిడి గోవిందరావు (ఎంజీఆర్)ను గెలిపించటానికి సిద్ధమయ్యారు. కలమటను నమ్ముకున్న తమ పరిస్థితి ఏంటా అని నియోజకవర్గంలో పలువురు నాయకులు, కార్యకర్తలు ఆందోళనలో పడ్డారు. స్థిరత్వం లేని రాజకీయాలు చేస్తున్న కలమట తీరుపై మండిపడుతున్నారు. నువ్వు చెప్పినట్లే 420ని ఓడిచి తీరుతామని స్పష్టం చేస్తున్నారు.

నిస్సహాయులకు భరోసా

అరసవల్లి: సాయం కోరి వచ్చిన నిస్సహాయులకు సీఎం వైఎస్ జగన్ భరోసా ఇచ్చారు. మండుటెండలో తన కోసం నిరీక్షించిన వారిని ఆత్మీయంగా పలకరించి ధైర్యం చెప్పారు. శ్రీకాకుళం జిల్లాలో సాగిన మేమంతా సిద్ధం బస్సుయాత్రలో భాగంగా బుధవారం మడపాం వద్ద కాసేపు పేద, సామాన్య వర్గాల వారిని కలిశారు. అనారోగ్య బాధితులకు తక్షణమే సాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి ప్రేమగా మాట్లాడడంతో వారు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు.

హైపో స్పాడియాస్ శస్త్రచికిత్స చేయిస్తానన్నారు



మాది జలుమూరు మండలం చల్లవానిపేట. నా మూడేళ్ల కొడుకు అభిషేక్‌కు హైపో స్పాడియాస్ అనే వ్యాధి ఉంది. మూడు సర్జరీలు చెన్నైలో చేయించాలి. అప్పులు చేసుకుని ఒక సర్జరీ చేయించాను. ఇంకో రెండు సర్జరీలు చేయించాలి. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నందున మనసున్న సీఎం జగనన్న వద్దకు నా కొడుకును తీసుకెళ్లాను. ఆయన ఎంతో ఆప్యాయంగా మాట్లాడారు. మా రిపోర్టులన్నీ చూశారు. కచ్చితంగా మిగిలిన రెండు సర్జరీలను చేయిస్తానని మాటిచ్చారు. ఆయన మాటిచ్చారంటే...కచ్చితంగా జరుగుతుందని ఇప్పటికే రాష్ట్రం మొత్తానికి తెలుసు. ఇప్పుడు మాకు చాలా ఆనందంగా ఉంది.

– ఆదినారాయణ (బండి అభిషేక్ తండ్రి)

చూడాలని వస్తే.... బండి ఇస్తానన్నారు



ఎలాగైనా జగనన్నను దగ్గరగా చూడాలని నా కల ఇప్పటికి నెరవేరింది. మడపాం టోల్‌గేట్‌కు ఉదయం 7 గంటలకే వచ్చేశాను. మధ్యాహ్నం ఒంటి గంటకు జగనన్నను చూశాను. నాతో ఆయన మాట్లాడిన ఆ క్షణం.. ఎంతో గర్వంగా అనిపించింది. నాకు త్రీ టైర్ మోటార్‌సైకిల్ ఇప్పిస్తానని మాటిచ్చారు. నేను ఆయనను చూసేందుకు వెళ్తే బండి ఇస్తానని చెప్పారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చెయ్యడానికి నేను సిద్ధం అని అన్నాను.

– జాడ నూకరాజు, దివ్యాంగుడు, వడ్డినవలస.

పేదోళ్లంటే.. ఇంత ప్రేమా



పేదోళ్లను దగ్గరగా చూసేందుకే చాలా మంది ఇష్టపడరు. కానీ సీఎం జగనన్న ఇలా పేదోళ్ల కనిపిస్తే, వ్యాధి బాధితులు కనిపిస్తే టక్కున బండి ఆపేసి వాళ్లతోనే మాట్లాడతాడు.. వాళ్లను ఆప్యాయంగా పలుకరించి బాగోగులు అడిగి సాయం చేస్తాడు. ఇలాంటి ముఖ్యమంత్రిని నేను చూడలేదు. మడపాంలో జగనన్నను చూడడానికి వెళ్లాను. మాలాంటి వారితో మాట్లాడారు. ఆయన మాటలే పెద్ద ఊరటలా ఉంటాయి. అందుకే మళ్లీ సీఎం ఆయనే.

– భోగిరాజు, మడపాం.

థాంక్యూ సీఎం సార్...

ఎచ్చెర్ల క్యాంపస్: ఆరోగ్య శ్రీ ద్వారా ప్రయోజనం పొందిన ఓ కుటుంబం శ్రీకాకుళం జిల్లాలోని అరిణాంఅక్కివలస నైట్ స్టే పాయింట్ వద్ద బుధవారం సీఎం వైఎస్ జగన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపింది. శ్రీకాకుళం జిల్లా నందిగాం మండలం నర్సిపురం గ్రామానికి చెందిన త్రిషాన్ అనే బాలుడికి ఆరోగ్య శ్రీ కింద రెండు చెవులకు కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్స చేశారు. ఆ బాలుడిని పట్టుకుని తండ్రి చమల్ల శ్రీధర్ సీఎం వైఎస్ జగన్‌ను కలిశారు. బాలుడి ఆరోగ్య పరిస్థితిపై సీఎం ఆరా తీశారు. 2022 జూలై 18న కాక్లియర్ ఇంప్లాంట్ చేశారు. ప్రస్తుతం బాలుడు చిన్న చిన్న పదాలు మాట్లాడుతున్నాడని, ఆరోగ్య శ్రీ తన బిడ్డను ఆదుకుందని శ్రీధర్ సంతోషం వ్యక్తం చేశారు.


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసినత్రిషాన్, అతని తండ్రి శ్రీధర్

మేమంతా సిద్ధం జన స్పందన

ఎచ్చెర్ల/ఎచ్చెర్ల క్యాంపస్/రణస్థలం/జి.సిగడాం: ఎచ్చెర్ల మండలంలోని అరిణాం అక్కివలస నుంచి ప్రారంభమైన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మేంసిద్ధం బస్సుయాత్రకు విశేష స్పందన లభించింది. జననేతను చూసేందుకు భారీగా అభిమానులు తరలివచ్చారు. ఈ సందర్భంగా పలువురు తమ అభిప్రాయాలను 'సాక్షి'తో పంచుకున్నారు.

ఆపద తీర్చారు..



జగన్‌బాబు మళ్లీ ముఖ్యమంత్రి అవుతారు. వృద్ధులు, చిన్నారులు, మహిళలు.. ఇలా అందరికీ మేలు జరిగింది. నెలకో పథకం ద్వారా మేలు చేస్తున్నారు.

– జరుగుళ్ల సరోజిని, కొంగరాం, ఎచ్చెర్ల మండలం

మళ్లీ గెలిపిస్తాం



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక వలంటీర్‌గా పనిచేసే అవకాశం దక్కింది. పేదల ఇళ్లకే వెళ్లి పథకాలు అందించాం. మళ్లీ జగనన్నను సీఎంగా గెలిపించుకుంటాం.

– వి.మాధురీలత, వలంటీర్, ఎస్ఎంపురం, ఎచ్చెర్ల మండలం

మా దేవుడు..



జగన్ సీఎం కావడంతో రూ.3 వేల పింఛన్ అందుతోంది. మాలాంటి వారికి దేవుడిలా ఆదుకుంటున్నాడు. నెల వరకూ సరిపడా డబ్బులు వస్తున్నాయి. వైఎస్సార్‌సీపీనే మళ్లీ గెలిపిస్తాం.

– ఎస్.చంద్రరావు, ఇబ్రహీంబాద్, ఎచ్చెర్ల మండలం

రైతులకు మేలు



జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులకు లబ్ధి చేకూరింది. రుణమాఫీ, రైతుభరోసా వంటి పథకాలతో మేలు జరిగింది. రైతులంతా జగనన్నకు రుణపడి ఉంటారు.

– గొర్లె శ్రీరాములునాయుడు, మురపాక, లావేరు మండలం

సంక్షేమ లబ్ధి



మా కుటుంబానికి అమ్మ ఒడి, ఆసరా, రుణమాఫీ వంటి పథకాలు వర్తించాయి. చాలా కుటుంబాలకు సంక్షేమ పథకాలతో లబ్ధి చేకూరుతుంది. ఈసారీ జగనన్నకే మా ఓటు.

– జాడ అప్పలరాజులు, అల్లినగరం, ఎచ్చెర్ల మండలం


సీఎం జగన్‌ను కలిసిన మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, ఎం.వి.స్వరూప్

ఎస్.కోట నుంచి కొత్తరోడ్డుకు..



విజయనగరం జిల్లా ఎస్.కోట సమీపంలో ఓ చిన్న పల్లె నుంచి ఓ కుటుంబం సీఎం జగన్‌ను చూసేందుకు ఆటోలో కొత్తరోడ్ (శ్రీకాకుళం)కు వచ్చారు. ఎర్రా అర్జీబాబు, భార్య దుర్గ, ఇద్దరు చిన్న పిల్లలతో కలిసి ఎండను సైతం లెక్క చేయకుండా జననేతను కలిసి చిత్రపటాన్ని అందజేశారు. సందర్భంగా అర్జీబాబు మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో ప్రతి హామీ నెరవేర్చారని, అమ్మఒడి వంటి సంక్షేమాలు పథకాలు అందుతున్నాయని చెప్పారు.